పోలీసు గస్తీ పెంచాలి



ప్రభుత్వ ఆస్పత్రులలో పోలీసు రక్షణ ఉండాలి. రాత్రి వేళల్లో గస్తీ పెంచాలి. అలాగే ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు త్వరితగతిన విచారణ, తక్షణ శిక్షలు అమలు చేయాలి. ప్రతి ఒక్కరిలో వైద్యులు, సిబ్బందిపై గౌరవ మర్యాదలు పెరిగేలా పాఠశాలలో నుంచి అవగాహన కల్పించాలి. అప్పుడే ప్రతి ఒక్కరిలో మార్పు వస్తుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కావు.

- ఎం.అరుణకుమారి, నర్స్, విలేజ్‌క్లినిక్, రాఘవరాజపురం, రైల్వేకోడూరు మండలం

వైద్యురాలిపై హత్యాచారం పాశవికం



కోల్‌కతా ఆర్‌జీకేఆర్ ఆసుపత్రిలో యువ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం అత్యంత పాశవికమైనది. న్యాయం చేయాలని అక్కడి డాక్టర్లు చేస్తున్న ప్రదర్శనలపై అల్లరిమూకలు దాడులు చేయడం మరింత బాధకు గురిచేసింది. కోల్‌కతా వంటి ఘటనలు తరచూ మహిళలపై జరుగుతూనే ఉన్నాయి. మహిళా డాక్టర్లతోపాటు నర్సింగ్ స్టాఫ్‌కు రక్షణ కల్పించాలి. వేగంగా దోషులను శిక్షించి డాక్టర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరోసా కల్పించాలి.

- సి.సుజాత, స్టాఫ్ నర్సు, పి.కొత్తపల్లి, పీహెచ్‌సీ, సిద్దవటం



వైద్యులలో ఆత్మవిశ్వాసం నింపాలి



మహిళా వైద్యుల రక్షణకు వెంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఆసుపత్రుల ప్రాంగణాలను సేఫ్‌జోన్‌గా ప్రకటించాలి. మూడెంచుల భద్రత కల్పించాలి. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తక్షణమే అమలు చేయాలి. ప్రభుత్వాసుపత్రులలో పోలీసు ఔట్ పోస్టులను బలోపేతం చేయాలి. మహిళా వైద్యులకు భద్రత పెంచి వారిలో సన్నగిల్లిన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి. రాత్రిళ్లు ముఖ్యంగా ఆస్పత్రుల వద్ద పోలీసుల పర్యవేక్షణ ఉంచాలి.

- డా.శివారెడ్డి, చెక్కర వ్యాధి వైద్య నిపుణుడు, కడప

మహిళా వైద్యులకు డే ఆఫ్ ఉండాలి



మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక భద్రతా చట్టం అమలు చేయాలి. అలాగే మహిళా డాక్టర్లపై ఒత్తిడి తగ్గించాలి. దేశంలో ఉన్న అన్ని బోధనాసుపత్రులలో సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి. మహిళా డాక్టర్లకు డే ఆఫ్ కచ్చితంగా ఉండాలి. మహిళా డాక్టర్లు పనిచేసే టైమింగ్ విషయంలో ఈ మధ్యనే సుప్రీంకోర్టు కూడా సీరియస్ అయ్యింది. వారిమీద భారం తగ్గించాలని పేర్కొంది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ పై జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పోలీసుల పర్యవేక్షణ ఉండాలి.

- డాక్టర్ కె శరత్ కమల్, పీహెచ్‌సీ, నందలూరు

క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం

రామాపురం : చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెలో బుధవారం రామాలయంలో శ్రీ సీతారాముల స్వాముల వారి కల్యాణ మహోత్సవంలో మంత్రి సోదరుడు డా.లక్ష్మీప్రసాద్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాతో సత్కరించి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

జాంబవంతుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మనగర్‌లో వెలసివున్న జాంబవంతుడి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు గావించారు. అలాగే మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అర్చకులు భక్తులకు అందించారు.

అనుంపల్లెలో లార్వా సర్వే

రాయచోటి అర్బన్ : దోమలు పుట్టకుండా .. కుట్టకుండా చూసుకోవడం ద్వారానే ప్రజలు పలురకాల జ్వరాలు వ్యాధుల బారిన పడకుండా తమను తాము కాపాడుకోవచ్చునని యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శిబ్యాల గ్రామం అనుంపల్లెలో వైద్యారోగ్య సిబ్బంది దోమల లార్వా సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో యండపల్లె పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



పసుపు పంటను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

సిద్దవటం : మండలంలోని మందపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వేనెంబర్ 29/10లో 70 సెంట్ల ప్రభుత్వ భూమిలో బుధవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని పెద్దపల్లి వీఆర్‌ఓ నాని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనెంబర్ 29/10లో 0.70 సెంట్ల ప్రభుత్వ భూమిని భాకరాపేట గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకొని పసుపు పంటను సాగు చేశారన్నారు. స్థానికులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదును పరిశీలించిన జాయింట్ కలెక్టర్ పంటను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని తహసీల్దారుకు ఆదేశించడంతో తహసీల్దారు మురాషావలి ఆదేశాల మేరకు బుధవారం పసుపు పంటను జేసీబీ యంత్రంతో తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని వీఆర్‌ఓ తెలిపారు.

వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు మృతి

నందలూరు : మండలంలోని అరవపల్లె గ్రామం తోటపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు మంగళవారం రాత్రి జాఫర్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఆకేపాటి అమరనాథరెడ్డి బుధవారం అరవపల్లెలోని మసీదుకు విచ్చేసి జాఫర్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జాఫర్ బేగ్, టైలర్ రఫీ, పార్టీ సీనియర్ నాయకులు గంపా సుధాకర్, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, మధు యాదవ్, నాగేశ్వర్ రెడ్డి, నాగభూషణ, ఉప సర్పంచ్ ఇబ్బు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది అడ్డగింత



రెవెన్యూ సిబ్బందిని అడ్డుకుంటున్న రవీంద్రబాబు

నందలూరు : స్థల వివాదంపై విచారణ జరిపేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిని ఓ వ్యక్తి అడ్డుకున్న సంఘటన నందలూరులో చోటు చేసుకుంది. సంఘ సేవకుడు వేపగుంట శ్యామ్‌రాజ్ అనే వ్యక్తి తమ స్థలాన్ని ఒక కుటుంబం వారు ఆక్రమించుకున్నారని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవికి బుధవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ విచారణ చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. తహసీల్దార్ అమరనాథ్, మండల సర్వేయర్, నాగిరెడ్డిపల్లి వీఆర్‌ఓ, సంబంధిత అధికారులను వివాద స్థలం వద్దకు పంపించారు. బుధవారం సాయంత్రం రెవెన్యూ సిబ్బంది కొలతలు వేసేందుకు లోపలికి రావచ్చా అని జంబు రవీంద్రబాబు, అతని భార్య జంబు శశికళను అనుమతి కోరారు. దీంతో వారు తమతో పాటు విచారణకు వచ్చిన అధికారులను అడ్డుకుని దూషించారని స్థల బాధితులు వేపగుంట శ్యామ్‌రాజ్, కుంచపు లక్ష్మీ నరసమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు.

అడుగంటిన జలాలు.. వరి చేనుకు నెర్రెలు

- వరుణుడి కరుణ కటాక్షం కోసం పూజలు
- చుక్క నీటి కోసం రైతుల పడిగాపులు
- కంటిపై కునుకులేకుండా రాత్రి పగళ్లు పొలాల వద్దనే..
- తిండిగింజల కోసం ఈ పాట్లంటున్న రైతన్నలు



నెర్రెలుబారిన వరి నాట్లు



బోరు పంపు నుంచి చుక్క చుక్క నీరే ఉబికి వస్తున్న నీరు

రాయచోటి టౌన్ : ఎన్ని ఫీట్లు వేసినా.. ఎన్ని విద్యలు అభ్యసించినా.. పొట్టకోసమేనన్న పెద్దల నానుడి. ఇంటినిండా తిండి గింజలుంటే చాలు మిగిలినవి ఎలాగో నెట్టుకరావచ్చని రైతులు నమ్మకం. అలాంటి రైతుల కళ్లలో ఇప్పుడు కన్నీళ్లు మిగులుతున్నాయి. కన్నీటిని బయటికి రాల్చలేక.. తన కళ్లలోనే కన్నీటి ధారలను దాచుకొంటూ తన కుటుంబానికి ఎలాగైనా పిడికెడు అన్నం పెట్టాలని కృతనిశ్చయంతో వరుణుడిపై భారం వేసి తనకున్న పొలంలో వరి నాట్లు వేసుకున్నాడు. వరి నాట్లు వేసిన మొదటి రోజు నుంచి వరుణుడు ముఖం చాటేశాడు. ఒక రోజైనా ఒక పదును కురుస్తుందనే కొండంత ఆశతో ఎదురు చూస్తున్నాడు. అయినా ఒక నీటి చుక్క అయినా నేల రాలలేదు. తన కళ్లెదటే వేసిన పంట ఎండిపోతోంది. ఇక చేసేది లేక పంటను ఎలాగైనా కాపాడుకోవాలనే ఆశతో రూ. లక్షలు ఖర్చు చేసి వందల కొద్ది అడుగులు బోర్లు వేసినా కనుచూపు మేర నీటి జాడ కనిపించడం లేదు. ఇక చేసేది లేక ఉన్న కొద్దిపాటి నీటినే చుక్క చుక్క నీటి బిందువులుగా చేర్చి కంటిపై కునుకులేకుండా కంటికి కాయలు కాసేలా చేనుకు నీరందిస్తున్నారు. అయినా అర ఎకరం పొలం కూడా తడవని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా రాయచోటి రూరల్ పరిధిలోని అన్ని గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొంది.

పెట్టిన పెట్టుబడికి ఇంట్లోకి తిండి గింజలు కూడా రాని పరిస్థితి ప్రస్తుతం కనిపిస్తోంది. అప్పులు చేసి వ్యవసాయం చేసిన వారి సంగతి అయితే దారుణంగా ఉంది. ఇంతటి దారుణమైన పరిస్థితులు ఖరీఫ్ ఎన్నడూ చూడలేదని రైతాంగం ఆవేదన చెందుతున్నారు. ఉన్న అరకొర భూములలో వరుణుడుపైన భారం వేసి సాగు చేస్తే చినుకు జాడలేక పంటకు నీరందక కన్నీటి పర్యంతం అవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు తమ జీవితాలను రోడ్డుపాలు చేయడం ఖాయం పలువురు రైతులు చెప్పారు. కాలువలకు నీరు అయినా వస్తే కాసింత పంటకు తడి ఇద్దామని అనుకుంటే అది కూడా జరుగక వరి చేనులో నెర్రలు చూడాల్సి వస్తోందని సాగు చేసిన వారి పరిస్థితి తయారైంది. తమను ప్రభుత్వం ఆదుకోకుంటే రైతుల బతుకులు చిద్రం కావడం ఖాయమని తెలియజేస్తున్నారు. ఖరీఫ్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే రబీలో సాగు చేయడం అసాధ్యమని, క్రాప్ హాలీడే చేయడమే మంచిదనే అభిప్రాయానికి రైతులు వస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బిందెడు నీళ్లు రావడం లేదు



మోటారు ఆన్ చేస్తుంటే కనీసం బిందెడు నీళ్లు రావడం లేదు. ఎడకాలవ వరకు కూడా పారలేదు. అంతలోనే ఆగిపోతున్నాయి. కనీసం అర ఎకరం వరి పంటను కాపాడుకోవడానికి ఎంతలా కష్టపడుతున్నామంటే. మోటరు వదలాలి.. పరిగెత్తుతూ వెళ్లి నీరు కాల్వకు మళ్లించాలి. ఇంతలో మోటారులో గాలి పడుతుంది. ఇప్పుడే ఇలా ఉంటే ఇంకా నాలుగు నెలలు ఎలా చేయాలో అర్థం కావడం లేదు. ఇలా అయితే పంట చేతికి వస్తుందానే నమ్మకం లేదు. ఈ పంటను పండించుకోవడానికి కూలీ పనికి కూడా వెళ్లడం లేదు.

- శ్రీనివాసులు, రైతు

చేసేది లేక.. అర ఎకరం వదిలేశాను



ఇంటిలో తిండి గింజలు ఉంటే దిగులుండదనే ధైర్యంతో ఎకరం పొలం వరి నాటాను. ఇప్పటికే అర ఎకరం పొలం నీళ్ల లేక వదిలేశాను. ఉన్న అర ఎకరం కూడా తడవడం లేదు. ఈ అర ఎకరం పొలాన్ని వదిలేయాల్సి వస్తుందోనని భయంగా ఉంది. బోర్లలో వచ్చే చుక్కచుక్క నీటిని వడిసి పట్టి వరి పొలాన్ని తడవాల్సి వస్తోంది. వరుణుడు కరుణిస్తాడనే నమ్మకంతో సాగు చేశాం. వరుణిడి కోసం కడవ సాంగెం కూడా చేశాం. అయినా చినుకు జాడ లేదు. ఈ పంట కూడా పోతే తిండిగింజలు లేక అల్లాడిపోవాల్సిందే.

- చంద్రశేఖర్, రైతు, రాయచోటి రూరల్

తగ్గిన వరి సాగు విస్తీర్ణం

రాయచోటి రూరల్ పరిధిలో సాధారణ అంచనా ప్రకారం 1240 (3,100 ఎకరాలు) హెక్టార్లు సాగు కావాల్సి ఉంది. అయితే వానలు కురవకపోవడంతో కేవలం 240 హెక్టార్లలో (600 ఎకరకాలలో మాత్రమే) సాగైంది. చాలా చోట్ల వరి పైరు సిద్ధంగా ఉన్నప్పటికీ వానలు కురవకపోవడంతో అలాగే వదిలేశారు. కొన్ని ప్రాంతాలలో అయితే నాటిన వరి నాట్లు ఎడిపోతున్నాయి. ఇప్పుడైనా వానలు వస్తే కాస్త ఉపశమనం కలిగిస్తుంది.

- దివాకర్, రాయచోటి వ్యవసాయ అధికారి

30 నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో నూతనంగా నిర్మించిన కొండగుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు జరుగునని ఆలయ నిర్వాహకులు బోనబోయిన గంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన కొండగుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనము, మాతృక పూజలు తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 31 తేదీన ఆంజనేయస్వామి, నవగ్రహాలు, శిఖర కలశం, ప్రతిష్ట నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

అన్నమాచార్య విద్యార్థుల ర్యాలీ

రాజంపేట : దోమకాటుతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు నివారణ ర్యాలీని బుధవారం చేపట్టారు. అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీని చేపట్టారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ర్యాలీని ప్రిన్సిపాల్ డా.స్వర్ణలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక దోమ కాటు కూడా ప్రాణాంతకరంగా మారవచ్చునన్నారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకొని ఆరోగ్యంగా ఉందామంటూ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన ధనుంజయ, పోలీసులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన రాతి చెరువు

సుండుపల్లె : మండల కేంద్రంలోని కట్టకింద పల్లి సమీపంలో ఉన్న రాతి చెరువు సుమారు 50 ఎకరాలకు పైగా కబ్జాకు గురైంది. ఈ భూ ఆక్రమణలు తొలగించాలని కూటమి నాయకులు టి.సుండుపల్లి ఎంఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.కల్యాణ్, ఓబులేసు, ప్రసాద్ రాజు, బి.వెంకటరమణ తదితరులున్నారు.

అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలి



ఎంపీడీఓ జవహర్‌బాబును ప్రశ్నిస్తున్న ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, శివయ్య

సిద్దవటం : తాగునీటి విషయంలో అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని ప్రతి దానికి రూల్స్ కావాలంటే పనులు జరగవని ఎంపీడీఓ జవహర్‌బాబు మండల సమావేశంలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మాధవరం–1 గ్రామ పంచాయతీని అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీటీసీ శివయ్య మండిపడ్డారు. మూడు వారాలుగా తాగునీరు అందడం లేదని, వెంకటేశ్వరపురంలో పాఠశాలకు ఆటస్థల కేటాయింపు చేయమన్న పట్టించుకోలేదని, మాధవరం పంచాయతీ వర్కర్‌లకు జీతాలు చెల్లించకుంటే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ఎంపీడీఓను ప్రశ్నించారు. ఆయా శాఖల అధికారులు సమస్యలపై సమాధానమిచ్చారు. మండలానికి ఎంత నిధులు వస్తున్నాయో.. వాటిని ఎక్కడా వినియోగిస్తున్నారో మాకు తెలియడం లేదంటూ.. ఇంకా తాము ఎందుకు సమావేశాలకు రావడం అంటూ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి అధికారుల తీరును ఎండగట్టారు. అందుకు ఎంపీడీఓ ఈ విషయాలపై ఎంపీపీతో చర్చించి వారి ఆదేశాలతో సభ్యులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని సభకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, తహసీల్దారు మురాషావలి, వ్యవసాయాధికారి రమేష్ రెడ్డి, ఎంఈఓ విలియంరాజు, ఎంఈఓ–2 అరుణ, డాక్టర్‌లు శివకుమార్, రంగలక్ష్మి, పలుశాఖల ఏఈలు మానస, జయచంద్ర, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, ఏపీఓ నరసింహులు, ఏపీఎం వెంకటేశ్వర్లు, అటవీశాఖ ఏబీఓ హైమావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీవిద్య, నాగరత్న, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదేమీ?



మండల కేంద్రానికి వెళ్లే రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలు

ఓబులవారిపల్లె : మండల కేంద్రం నుంచి చిన్నఓరంపాడు మార్గంలో ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ప్రతినిత్యం ఈ మార్గం గుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడూ రద్దీగా ఈ మార్గం ఉంటుంది. అయితే ఎంపీడీఓ కార్యాలయం నుంచి పాములేరు బ్రిడ్జి వరకు దారిపై గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు గుంతలు తప్పించబోయి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గం గుండా నాయకులు, అధికారులు ప్రతినిత్యం ప్రయాణిస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇటీవలే ఈ గుంతల సమీపంలో కల్వర్టరు వద్ద స్కూల్ బస్సు బోల్తా పడి విద్యార్థి చనిపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రజలను కోరుకుంటున్నారు. రేపు శుక్రవారం మండల సర్వసభ్య సమావేశంలో నైనా ఈ విషయంపై అధికారులు చర్చించి చర్యలు తీసుకోవాలని ప్రజలు అంటున్నారు.

మొదలైన చవితి వేడుకల సందడి



వినాయక చవితికి చందా ఇవ్వండి అంకుల్ అంటున్న చిన్నారులు

రాజంపేట టౌన్ : వినాయక చవితి అంటే పిల్లల్లోనే కాదు వయోవృద్ధుల్లోనూ ఆనందం ఉరకలేస్తుంది. ఇక చిన్నపిల్లల్లో అయితే వారి ఆనందానికి ఆకాశమే హద్దవుతుంది. వినాయక చవితి పండుగకు మరో పదిరోజులు సమయం ఉన్నప్పటికీ ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఉత్సవాల ఏర్పాటు కోసం ఉత్సవ కమిటీ ప్రతినిధులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వీరికి తోడు చిన్నపిల్లలు కూడా తాము సైతం అంటూ తమకు చేతనైన పనులు చేస్తున్నారు. ఇదిలావుంటే అనేక ప్రాంతాల్లో కొంతమంది చిన్నపిల్లలు జతకట్టి చిన్న విగ్రహాలను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక వనరులు ప్రధానం కావడంతో చిన్నపిల్లలు ఉత్సాహంగా చందాలు వసూలు చేస్తూ సందడి చేస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో వాహనదారులను ఆపి చందాలు అడుగుతున్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

రామాపురం : భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందగజపతిరాజు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1 నుంచి జరిగే సభ్యత్వ నమోదులో అనుసరించాల్సిన చర్యలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గంప సుబ్బరాయుడు, దేవగట్ల వెంకటశివ, ముత్తిశెట్టి చంద్రశేఖర్, మహేష్, వెంకటరమణ, రాంబాబు, నందగోపాల్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా చెన్నకేశవుని కల్యాణం



చెన్నకేశవస్వామి కల్యాణం జరుపుతున్న వేదపండితులు



పెద్దసంఖ్యలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెనగలూరు : కొండూరులో నూతనంగా నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు ప్రత్యేక యాగశాలలో వివిధ రకాల హోమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా చెన్నకేశవ ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిపారు. వేదపండితులు కల్యాణ క్రతువును చేయించారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ కుటుంబసభ్యులు కల్యాణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కల్యాణంలో రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అయన వెంట చిట్వేలి, కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు మండలాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అలయ చైర్మన్ కొండూరు విజయ్‌రెడ్డి, కొండూరు అజయ్‌రెడ్డిలు స్వామి వారి కల్యాణం సందర్భంగా 3 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.



మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మతో చర్చిస్తున్న కొరముట్ల

మద్యం బాటిళ్లు స్వాధీనం

సంబేపల్లె : అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ భక్తవత్సలం, సిబ్బంది బుధవారం ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మండల పరిధిలోని రౌతుకుంట క్రాస్ వద్ద అతనిని పట్టుకుని అక్రమంగా తరలిస్తున్న 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో వండాడి – చాకిబండ రహదారి పక్కనున్న మాండవ్య నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకుని పోలీసులకు, ఎస్‌ఈబీ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ సుధాకర్‌ను వివరణ కోరగా ఎస్‌ఈబీ అధికారులు, ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామని ఆయన తెలియజేశారు.

గాలివీడులో..

గాలివీడు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పి.రామకృష్ణ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున పాపాగ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో గస్తీలో ఉన్న ఎస్‌ఐ తన సిబ్బందితో ట్రాక్టర్‌ను వెంబడించి దానంరెడ్డిగారిపల్లె వద్ద ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ గంగాధర్, ఓనర్ అంజిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణతోనే జీవరాసుల మనుగడ



మొక్కను నాటుతున్న విజన్ ప్రతినిధులు

రాజంపేట టౌన్ : పర్యావరణ పరిరక్షణతోనే జీవరాసుల మనుగడ సాధ్యం కాగలదని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విజన్ సంస్థ కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్యనాయుడు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు రమణయ్య, వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భయం వీడితేనే జయం వరిస్తుంది

రాయచోటి అర్బన్ : లక్ష్యసాధనలో భయాన్ని వీడి ధైర్యంగా ముందుకు సాగితేనే విజయం వరిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు పి.వై.నవీన్ అన్నారు. బుధవారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్ మ్యాప్ టు సక్సెస్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భయాన్ని వీడి పట్టుదలతో ముందుకు సాగితే లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చన్నారు. అతినిద్ర, సోమరితనం, రుణాత్మక ఆలోచనలు, మొహమాటం వంటి లక్షణాలను ప్రతి ఒక్కరూ వదులుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో భావప్రకటన స్వేచ్ఛను పెంపొందించుకోవాలంటూ సూచించారు. అనంతరం కళాశాల ఏడీ సుధాకరరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలాజితో, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక



విద్యార్థుల ఎంపికలు నిర్వహిస్తున్న అధికారులు

రాజంపేట : ఏయూలో మహిళా ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపికలు బుధవారం నిర్వహించారు. ఐదవ ఆంధ్రా గరల్స్ బెటాలియన్ (తిరుపతి) వారు ఈ విద్యాసంవత్సరానికి ఈ ఎంపికలు నిర్వహించారు. కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ అనూజ్ వద్వా, సుబేదార్ సింగార్‌సింగ్, హవల్‌దార్ రమేష్‌లు విచ్చేసి విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వ పరీక్షలను నిర్వహించారు. 200 మందికి గాను 90మందిని ఎంపిక చేశారు. అలాగే గత ఏడాది ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థులకు నిర్వహించిన నైపుణ్యపరీక్షలో ప్రతిభ కనపరిచినవారికి ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో పీడీ నాగముని, సీటీఓ దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.